ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

● కలెక్టర్ హనుమంతు కె.జెండగే

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, మార్చి 4 : ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యమిచ్చి పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఆయన పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ ప్రజాభవన్ నుంచి వచ్చే ఫిర్యాదులను జాప్యం లేకుండా పరిష్కరించాలని, తీసుకున్న చర్యలపై కలెక్టరేట్ పరిపాలన అధికారికి నివేదించాలని ఆదేశించారు. ఆన్‌లైన్ లోనూ నమోదు చేయాలన్నారు. మొత్తం 45 ఫిర్యాదులు అందాయని, అందులో రెవెన్యూ శాఖ 34, పోలీసు శాఖ 3, జిల్లా పంచాయతీ విభాగంలో 2, పౌర సరఫరాలు, మైనారిటీ, వెనుకబడిన తరగతుల శాఖ, యాదాద్రి దేవస్థానం, భువనగిరి మున్సిపాలిటీ, నీటి పారుదల శాఖలకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జయశ్రీ, జగన్నాథరావు, డీఆర్‌డీఓ ఎంఏ కృష్ణణ్, కలెక్టరేట్ పరిపాలన అధికారి జగన్మోహనప్రసాద్, సూపరింటెండెంట్ రామ్మూర్తి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మానసిక పరిపక్వతకు తగిన బోధన చేయాలి

మోత్కూరు ఐఈఆర్‌టీ భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ క్యాంపును పరిశీలిస్తున్న జిల్లా ఐఈ కో ఆర్డినేటర్ లింగారెడ్డి

మోత్కూరు, మార్చి 4 : దివ్యాంగ విద్యార్థులకు మానసిక పరిపక్వత వచ్చేలా తగిన విద్యా బోధన చేయాలని జిల్లా ఐఈ కో ఆర్డినేటర్ పెసరు లింగారెడ్డి అన్నారు. పట్టణంలోని ఐఈఆర్‌టీ భవిత కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రత్యేక క్యాంపును ఆయన పరిశీలించారు. ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రత్యేక బోధనోపాధ్యాయులను నియమించిందన్నారు. భవిత కేంద్రంలో విద్యార్థుల మానసిక స్థితిని బట్టి వివిధ బోధనోపకరణాలు ఉపయోగించి బోధించాలని సూచించారు. అనంతరం క్యాంపునకు వచ్చిన దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.రవీందర్‌రెడ్డి, ఐఈఆర్‌పీలు షాజహాన్, షబానా, ఫిజియోథెరపీ డాక్టర్ జగిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెళకువలతో కూడిన విద్యాబోధన చేయాలి

గాంధీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఏఎంఓ జె.శ్రీనివాస్

మోత్కూరు, మార్చి 4 : విద్యార్థులకు మెళకువలతో కూడిన నాణ్యమైన విద్యాబోధన చేయాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి జె.శ్రీనివాస్ అన్నారు. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు విద్యాబోధనలో తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.ప్రమీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను వంద శాతం పూర్తి చేయాలి

● ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ సుమన్ కళ్యాణ్

రామన్నపేట : నీర్నెముల గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ సుమన్ కళ్యాణ్

రామన్నపేట, మార్చి 4 : పల్స్‌పోలియో కార్యక్రమాన్ని 100శాతం పూర్తి చేయాలని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుమన్ కళ్యాణ్ అన్నారు. మండలంలోని నీర్నెముల గ్రామంలో సోమవారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఐదేండ్లలోపు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఆయన వెంట పల్లె దవాఖాన వైద్యుడు వెంకట్, హెచ్ఈఓలు ఇస్తారి, గోపాల్, ఏఎన్ఎం కవిత, ఆశ వర్కర్లు ఉన్నారు.

ప్రభుత్వ దవాఖానలో ఆకస్మిక తనిఖీ

అడ్డగూడూరు ప్రభుత్వ దవాఖానలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి వంశీకృష్ణ

అడ్డగూడూరు, మార్చి 4 : మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి వంశీకృష్ణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. పల్స్ పోలియో కార్యక్రమానికి అవసరమైన సూచనలు చేశారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. రోగులకు అందుబాటులో ఉండి మంచి వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ నర్సయ్య పాల్గొన్నారు.

ప్రజా పాలన సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీడీఓ

మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన సేవా కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీడీఓ మనోహర్‌రెడ్డి

మోత్కూరు, మార్చి 4 : ప్రజల నుంచి ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సేవా కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మనోహర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజా పాలన దరఖాస్తుల్లో తప్పులను సరి చేయడం కోసం కంప్యూటర్ సేవా కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది రాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చౌటుప్పల్, మార్చి 4 : ఇటీవల తంగడపల్లి రోడ్డులో విద్యుదాఘాతంతో సిద్ధివినాయక బైక్‌పాయింట్ దగ్ధమైంది. షాపు నిర్వాహకులు కె.రాజు, బి.జగన్‌కు మండల టూ వీలర్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం రూ.70వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి ఊడుగు నాగరాజుగౌడ్, నాయకులు మహేశ్, యాదయ్య, రాములు, శ్రీధర్, శ్రీను, స్వామి, వి.అంజయ్య, జనార్దన్‌రెడ్డి, మహేశ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



తుర్కపల్లి : మంచిరోని మామిళ్లలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

తుర్కపల్లి, మార్చి 4 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని వేల్పుపల్లి, దత్తాయపల్లి, ఇబ్రహీంపురం, కోనాపురం, మంచిరోని మామిళ్ల, వీరారెడ్డిపల్లి, గంధమల్ల గ్రామాల్లో సోమవారం సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే 4 హామీలను అమలు చేసిందని, మిగిలినవి సైతం అమలు చేస్తామని అన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతామని తెలిపారు. అనంతరం ముల్కలపల్లి గ్రామంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఉత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి మధుసూదన్ రెడ్డి, మండల అధ్యక్షురాలు చైతన్య, ఎంపీటీసీ మొహన్‌బాబు, నాయకులు శంకర్‌నాయక్, నర్సింహులు, కర్ణాకర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్లు ప్రారంభం

బొమ్మలరామారం : మండలంలోని పిల్లిగుండ్ల తండా, గోవిందుతండా, లక్ష్మీతండా, వాలుతండా, కోమటికుంటతండా, బోటిమీదితండా, జీవుతల తండా, యావాపూర్, రంగాపూర్ గ్రామాల్లో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, తండాల అభివృద్ధికి అధిక నిధులు మంజూరు చేస్తానని అన్నారు. తండాల్లో మౌలిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యమిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సింగిర్తి మల్లేశ్, మర్రి భగవంతరెడ్డి, హేమంత్‌రెడ్డి, రాజునాయక్, శ్రీకాంత్, ఈశ్వర్, వెంకటేశ్ గౌడ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడు చంద్రం యాదవ్‌కు నివాళి

చంద్రం యాదవ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి, నాయకులు

భూదాన్ పోచంపల్లి, మార్చి 4 : ఇటీవల మృతిచెందిన భువనగిరి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకుడు దొడ్డమోని చంద్రం యాదవ్ సంతాప సభను పట్టణంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంద్రం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు పాటి సుధాకర్‌రెడ్డి, సీత వెంకటేశం, కౌన్సిలర్లు ఉన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ధర్నా

ఆర్డీఓ శేఖర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

చౌటుప్పల్, మార్చి 4 : పట్టణ ప్రజల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ వి.శేఖర్‌రెడ్డికి వినత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని లక్కారం చెరువుకు బస్వాపురం ప్రాజెక్ట్ ద్వారా పిల్లాయిపల్లి కాల్వ నుంచి గోదావరి జలాలు అందించాలన్నారు. చర్లగూడెం ప్రాజెక్టు నుంచి తంగడపల్లి చెరువు నింపి తాగు నీరు అందించాలని కోరారు. పట్టణ కేంద్రంలోని అంగడి స్థలాన్ని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని, గాంధీ పార్కును సర్వే చేసి అభివృద్ధి చేయాలని అన్నారు. నిరుపేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించి ఇంటి నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎండీ పాషా, బండారు నర్సింహ, బాలయ్య, దండ అరుణ్‌కుమార్, ఆకుల ధర్మయ్య, బత్తుల దాసు, శ్రీను, స్వామి, ఈదయ్య, కృష్ణ పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోవాలి : ఎంపీడీఓ

మండల పరిషత్ కార్యాలయం వద్ద దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

భూదాన్ పోచంపల్లి, మార్చి 4 : గృహజ్యోతి పథకానికి అర్హులై ఉండి విద్యుత్ జీరో బిల్లు రానివారు మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రాపర్తి భాస్కర్ అన్నారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పుడ్ సెక్యూరిటీ కార్డు, ఆధార్, కరెంట్ బిల్లు, ప్రజాపాలన దరఖాస్తు రసీదు, మొబైల్ నెంబర్, జిరాక్స్ పత్రాలను అందజేయాలని సూచించారు. గతంలో ప్రజాపాలనలో దరఖాస్తు చేయనివారు కూడా అప్లికేషన్ పెట్టుకోవచ్చన్నారు.

కరాటే పోటీల్లో నిహారికకు గోల్డ్ మెడల్

కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చౌటుప్పల్, మార్చి 4 : తెలంగాణ స్పోర్ట్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కరాటే చాంపియన్‌షిప్ - 2024 పోటీలను హైదరాబాద్‌లోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఇటీవల నిర్వహించారు. ఈ పోటీల్లో చౌటుప్పల్ పట్టణంలోని చందన స్కూల్ విద్యార్థిని నిహారిక గోల్డ్‌మెడల్ సాధించగా మరో ఇద్దరు విద్యార్థులు తను, జయసాయిరెడ్డి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారిని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అవ్వారు రామేశ్వరి, కరాటే కోచ్ చంద్రమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామి కల్యాణం



చెన్నకేశవస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

తుర్కపల్లి, మార్చి 4 : మండలంలోని వాసాలమర్రిలో చంద్రాయణగుట్టపై గల చెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం చెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దేవతామూర్తులను నూతన పట్టువస్త్రాలతో అలంకరించి డప్పు వాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల మధ్య ముత్యాల తలంబ్రాలు పోసి కల్యాణతంతు నిర్వహించారు. దేవతామూర్తులకు ఒడి బియ్యం పోశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కవిత

ప్రమాణ స్వీకారం చేస్తున్న గుర్రం కవిత

మోత్కూరు, మార్చి 4 : మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన గుర్రం కవిత ఎన్నికయ్యారు. ప్రిసైడింగ్ ఆఫీసర్, భువనగిరి ఆర్డీఓ అమరేందర్ సమక్షంలో మున్సిపల్ కార్యాలయంలో సోమవారం చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించారు. మున్సిపాలిటీలో 12 మంది కౌన్సిలర్లకు గాను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన 10 మంది హాజరయ్యారు. ఏడు, పది వార్డుల కౌన్సిలర్లు తీపిరెడ్డి సావిత్రి, బొడ్డుపల్లి కళ్యాణ్ చక్రవర్తి గైర్హాజరయ్యారు. 11వ వార్డు కౌన్సిలర్ గుర్రం కవితను చైర్‌పర్సన్‌గా ఒకటో వార్డు కౌన్సిలర్ పురుగుల వెంకన్న ప్రతిపాదించగా ఎనిమిదో వార్డు కౌన్సిలర్ బొల్లేపల్లి వెంకటయ్య బలపరిచారు. మిగతా కౌన్సిలర్లు చేతులెత్తి ఆమోదం తెలిపారు. దీంతో కవిత ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి అమరేందర్ ప్రకటించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కవితతో ప్రమాణ స్వీకారం చేయించారు. సమావేశంలో తాసీల్దార్ రాంప్రసాద్, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీకాంత్ పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మున్సిపల్ పాలకవర్గానికి తగిన ప్రాధాన్యత కల్పించి గౌరవిస్తానని, అభివృద్ధిలో భాగస్వాములను చేస్తానని హామీ ఇచ్చారు. తన ఎన్నికకు సహకరించిన పాలకవర్గ సభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

మానెపల్లి వజ్రాల వ్యాపారిపై కేసు నమోదు చేయాలి

● కలెక్టర్‌కు మున్సిపల్ మాజీ చైర్మన్ జహంగీర్ వినతి

భువనగిరి కలెక్టరేట్, మార్చి 4 : దళితుల సీలింగ్, అసైన్డ్ భూముల్లో వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించిన మానెపల్లి వజ్రాల వ్యాపారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ హనుమంతు కె.జెండగేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పడిగిపల్లి గ్రామ పరిధిలో 61, 62, 63, 64, 75, 76, 86, 100, 114, 126 సర్వే నంబర్లలో దళితులకు అసైన్డ్ చేసిన భూముల్లో హైదరాబాద్‌కు చెందిన మానెపల్లి వజ్రాల వ్యాపారి రామారావు, అతని కుమారులు సంబంధిత అధికారుల అనుమతి లేకుండా గుడి నిర్మాణం చేశారన్నారు.

దీనిపై విచారణ జరిపి దళితులకు న్యాయం చేయాలని కోరారు. దేవస్థానం భూములు కోల్పోతున్న దళిత కుటుంబాలకు ప్రస్తుత మార్కెట్ ప్రకారం ధర కట్టించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ధరణి రికార్డుల పరిశీలన

ఆత్మకూరు(ఎం) : ధరణి రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ అమరేందర్

ఆత్మకూరు (ఎం), మార్చి 4 : తాసీల్దార్ కార్యాలయంలో ధరణి రికార్డులను భువనగిరి ఆర్డీఓ అమరేందర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం రైతుల నుంచి వచ్చే దరఖాస్తులను స్వీకరించి పరిష్కరించాలన్నారు. కార్యాలయం ఉద్యోగులంతా సమయపాలన పాటించి విధులు నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట తాసీల్దార్ రవికుమార్, డిప్యూటీ తాసీల్దార్ సఫియొద్దీన్, ఆర్ఐ మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

నిదానపల్లిలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ యాకూబ్‌నాయక్

● ఎంపీడీఓ యాకూబ్‌నాయక్

రామన్నపేట, మార్చి 4 : జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ యాకూబ్‌నాయక్ అన్నారు. మండలంలోని నిదానపల్లి గ్రామంలో సోమవారం వన నర్సరీని పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఏంపీఓ అంజిరెడ్డి, ఏపీఓ వెంకన్న, పంచాయతీ కార్యదర్శి సుమన్, ఫీల్డ్ అసిస్టెంట్ భాగ్యమ్మ పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం

భువనగిరి కలెక్టరేట్, మార్చి 4 : మండలంలోని హన్మాపురం గ్రామంలో రేణుకా ఎల్లమ్మ, జమదగ్ని కల్యాణం, భ్రమరాంబ కేతమ్మ సమేత మల్లికార్జున స్వామి కల్యాణ వేడుకలను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ తోటకూర వెంకటేశ్ యాదవ్ అన్నదానం నిర్వహించారు. కల్యాణోత్సవంలో ఎంపీపీ నరాల నిర్మల, వైస్ ఎంపీపీ ఏనుగు సంజీవరెడ్డి, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

భువనగిరి అర్బన్, మార్చి 4 : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బి.మాధురీచంద్ర అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని బాబు జగ్జీవన్‌రావు చౌరస్తా నుంచి ర్యాలీ, మారథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళా తమ హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాధవి, మల్లిక, అనితారెడ్డి, రాణి, స్వాతి, చిత్రలేఖ, మౌనిక, అర్చన, ప్రవళిక పాల్గొన్నారు.

బాహుపేటలో వైద్య శిబిరం

యాదగిరిగుట్ట, మార్చి 4 : మొబైల్ మెడికేర్ యూనిట్ కార్యక్రమంలో భాగంగా రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని బాహుపేటలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 60 ఏండ్లు పైబడిన వృద్ధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మొత్తం 89 మందికి ఉచితంగా వైద్య సేవలు అందజేసినట్లు డాక్టర్ చల్లా జయశ్రీ తెలిపారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ వైస్ చైర్మన్ దిడ్డి బాలాజీ, సభ్యులు ఎస్పీ ఉపేందర్‌రావు, స్పందన, వెంకమ్మ, లావణ్య, రేణుక, డివిజన్ కమిటీ సభ్యులు విజయ్‌కుమార్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ, పీజీ విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు

భువనగిరి అర్బన్, మార్చి 4 : జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు సోమవారం డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భువనగిరి సీడీపీఓ స్వరాజ్యం మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీలతో విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికి వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు హర్ష, నిఖిత, సూపర్‌వైజర్లు పద్మ, నర్మద, కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ పాల్గొన్నారు.

మాతృమూర్తి నేత్రదానం

భూదాన్ పోచంపల్లి, మార్చి 4 : మండలంలోని గౌస్‌కొండ గ్రామానికి చెందిన వాకిటి లక్ష్మమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. కామినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మహిళా దినోత్సవం సందర్భంగా మాతృమూర్తి నేత్రాలు దానం చేయాలని ఆమె కొడుకులు నిర్ణయించుకొని ఎల్‌వీ ప్రసాద్ కంటి దవాఖానకు సమాచారం అందించారు. ఆ మేరకు ఆసుపత్రిలో కుమారుల సమక్షంలో లక్ష్మమ్మ కండ్లు స్వీకరించారు. అవయవ దానం చేయడం పట్ల పలువురు అభినందించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

వలిగొండ, మార్చి 4 : దవాఖానలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో యాచిస్తూ జీవనం గడుపుతున్న 65 ఏండ్లు పైబడిన గుర్తు తెలియని వ్యక్తి ఫిబ్రవరి 25న సుంకిశాల పరిధిలోని మెగా గ్యాస్ కంపెనీ సమీపంలో రైతులు పొలాలకు వాడిన మందు బాటిల్‌లో మంచి నీళ్లు పట్టుకొని తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం నల్లగొండ ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. సోమవారం మృతి చెందాడు. వైద్యుల సమాచారం మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

దివీస్‌లో జాతీయ భద్రతా వారోత్సవాలు

జాతీయ భద్రతా వారోత్సవాల ప్రతిజ్ఞ చేస్తున్న పరిశ్రమ కార్మికులు

చౌటుప్పల్, మార్చి 4 : లింగోజిగూడెం గ్రామ పరిధిలోని దివీస్ పరిశ్రమలో సోమవారం జాతీయ భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమలో వారోత్సవాల జెండాను ఆవిష్కరించారు. సేఫ్టీ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అనంతరం భద్రతా ప్రమాణాలపై కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. అక్కడ అవలంబిస్తున్న భద్రత వ్యవస్థ గురించి పలువురు వివరించారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు ఎస్.రామకృష్ణ, జి.హేమంత్‌కుమార్, పి.శ్రీనివాస్ రావు, పి.సుధాకర్ రావు, జి.బాలకిశోర్, ఎన్.సాంబశివరావు పాల్గొన్నారు.

'అర్హులకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలి'

బీబీనగర్, మార్చి 4 : అర్హులైన నిరుపేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు గోరుకంటి బాలచందర్ అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చిన్నరావులపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 4లో నిరుపేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించేందుకు దరఖాస్తులు ఆహ్వానించారన్నారు. అధికారులు గ్రామసభలు నిర్వహించి 54 మందిని అర్హులుగా ఎంపిక చేశారని తెలిపారు. ఎన్నికల కోడ్ రావడంతో పెండింగ్ లో పెట్టారని, ఆ ఫైల్‌ను పరిశీలించి లబ్ధిదారులకు పట్టాలు అందజేయాలని కోరారు.